క్లుప్తంగా

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి



సమస్యలను వివరిస్తున్న తహసీల్దార్

బేతంచెర్ల: స్పందన కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 9 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో ఆన్‌లైన్, డీ పట్టా మంజూరు, పొలాల చదును కోసం అనుమతి కోరుతూ, బోర్లు వేసుకోవడానికి అనుమతి కోరుతూ దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఆర్.కొత్తపల్లె ఎంపీటీసీ సభ్యుడు మునేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు దారి చూపండి

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ముస్లింల శ్మశాన వాటికలోకి వెళ్లేందుకు రహదారి సౌకర్యం చూపాలని ముస్లింలు తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడను కలిసి వినతి పత్రం అందజేశారు. 1996లో ముస్లింల శ్మశాన వాటిక కోసం 223 సర్వే నెంబర్‌లో 82 సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. శ్మశాన స్థలాన్ని కొంతమంది ఆక్రమించడంతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

హమాలీ, రిక్షా కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ప్యాపిలి: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న హమాలీలు, రిక్షా కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ కోరారు. సోమవారం హమాలీ, రిక్షా కార్మికులు సీపీఐ నాయకులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. 35 ఏళ్లుగా హమాలీ, రిక్షా కార్మికులుగా పనిచేస్తున్నా తమను గత ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు డీటీని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేశ్, ఆంజనేయులు, రవికుమార్, పెద్ద శ్రీనివాసులు, రాము, గోవింద్, చాంద్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు

కొలిమిగుండ్ల: సామాజిక బాధ్యత కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాంకో సిమెంట్ కంపెనీ ప్రతినిధులు సోమవారం కనకాద్రిపల్లె గ్రామంలో పర్యటించారు. గ్రామానికి సంబంధించి 700 ఎకరాల భూమిని 17 ఏళ్ల క్రితం రాంకో కంపెనీకి రైతులు విక్రయించారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామ పెద్దలు కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు వేసి, పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధి పరిచి, చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. శివాలయం, రామాలయం, మారెమ్మ ఆలయంతో పాటు పలు ఆలయాలను జీర్ణోద్ధరణ చేయాలన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న న్యాయవాదులు

డోన్: స్థానిక బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో బార్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి



మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

డోన్ టౌన్: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి తక్షణ చికిత్స అందించాలని జిల్లా అడిషనల్ క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ బాలాజీ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధి లక్షణాలున్న రోగుల పట్ల నిర్లక్ష్యం వీడి మరిన్ని నిర్ధారణ పరీక్షలు చేసి వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మహ్మద్ హనీఫ్, వైద్యులు అజ్మతుల్లా, రాంబాబు, రెడ్డి పాల్గొన్నారు.

అందమైన వనాలు .. ఆటవిడుపు కేంద్రాలు

- పచ్చదనంతో విరాజిల్లుతున్న పార్కులు
- చిన్నారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- యోగా, ఈత, నడక, వ్యాయామానికి పట్టణవాసులకు అవకాశం
- మానసిక ఉల్లాస కేంద్రాలుగా పార్కులు

డోన్: ఉద్యాన వనాలు పట్టణ వాసులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించనున్నాన్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతతను చేకూర్చనున్నాయి. పిల్లలకు ఆట విడుపు కేంద్రాలుగా విరాజిల్లనున్నాయి. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంలో భాగంగా పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. అందులోభాగంగా సుమారు రూ.6 కోట్లను మంజూరు చేసింది. ఆ నిధులతో కొన్ని పార్కులు పూర్తికాగా మరికొన్నింటిలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

డోన్ పట్టణంలో..

పట్టణ నడిబొడ్డున బాపనోల్ల తోట వీధికి కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా), డిస్ట్రిక్ మినరల్ ఫండ్, స్పెషల్ గ్రాంట్ కింద రూ.1.65 లక్షలను మంజూరు చేశారు. మహాలక్ష్మి హాస్పిటల్ వద్ద కుడా సహకారంతో రూ.59.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. స్థానిక కేవీఎస్ పార్కులో డీఎంఎఫ్ ఫండ్ రూ.25 లక్షలతో యోగా సెంటర్‌ను, నెహ్రూ నగర్‌లోని పార్కులో రూ.20 లక్షలతో వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. బాపనోల్ల తోట పరిధిలో మహిళలకు ప్రత్యేకంగా స్విమ్మింగ్‌పూల్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుచేస్తున్నారు. కళ్యాణ్ ఎస్టేట్‌లో రూ.15.50 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. బేతంచెర్ల పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో పాత పార్కును రూ.40 లక్షలతో ఆధునీకరించారు.



కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన డోన్ నెహ్రూనగర్ పార్కు



డోన్ కేవీఎస్ కాలనీలో ఏర్పాటైన పార్కు

పట్టణ రూపురేఖలే మారిపోయాయి



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో పార్కులను అభివృద్ధి చేశారు. దీంతో పట్టణ రూపురేఖలే ఒక్కసారిగా మారిపోయాయి. పలు ప్రాంతాల్లోని పార్కులు ఎంతో ఆకర్షణీయంగా, ఆట విడుపు కేంద్రాలుగా మారి స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – అశోక్‌కుమార్, ఇందిరానగర్

మానసిక ఎదుగుదల కేంద్రాలు



లక్ష జనాభా కలిగిన డోన్ పట్టణంలో గతంలో ఒకే ఒక్క పార్కు ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మొత్తం ఏడు పార్కులను రూ.6 కోట్లతో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. అందమైన పూలమొక్కలు, వివిధ రకాల ఆటలాడుకునే పరికరాలు పిల్లల మానసిక ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడతాయి. – నాగభూషణంరెడ్డి, సీనియర్ న్యాయవాది

పచ్చదనం, పరిశుభ్రతే లక్ష్యం



ఇప్పటికే పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పదివేల మొక్కలు నాటి సంరక్షించాం. అనుక్షణం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని పార్కులను అభివృద్ధి చేసి పట్టణాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుతాం. – నప్తశైల రాజేష్, మునిసిపల్ చైర్మన్

గజవాహనంపై చెన్నకేశవస్వామి



బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి సోమవారం గజవాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను గజవాహనంపై ఆశీనులను చేసి ఆలయం నుంచి నీళ్ల ట్యాంకు, కొత్త బస్టాండు మీదుగా పాతబస్టాండు వరకు మేళతాలల మధ్య ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్ ఈవీ సుజాత శర్మ తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో భూముల రీసర్వే

కొలిమిగుండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన మీర్జాపురం, బి.తాడిపత్రి, హనుమంతుగుండం గ్రామాల్లో భూముల రీసర్వే కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించినట్లు తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. ఏళ్ల తరబడి నుంచి కచ్చితమైన విస్తీర్ణం లేక పోవడం, రికార్డుల్లో తేడాలు ఉండటంతో పాటు పలు సమస్యల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అధునాతన పరికరాలతో మండల సర్వేయర్‌తో పాటు విలేజ్ సర్వేయర్లు, ఇతర సిబ్బంది సాయంతో రీసర్వే కింద పూర్తి స్థాయిలో కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేస్తుందన్నారు. మీర్జాపురంలో 248 మంది రైతులు, బి.తాడిపత్రిలో 934 మంది, హనుమంతుగుండంలో 872 మంది రైతులు ఉన్నారని చెప్పారు. మూడు గ్రామాల్లో 8450 ఎకరాల భూమి ఉందన్నారు. రీసర్వే ప్రక్రియ పూర్తి కాగానే సర్వే రాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు భూహక్కు పత్రాలు అందజేస్తామని తెలిపారు.



హనుమంతుగుండంలో సర్వే చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో యాగంటీశ్వరుడి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతుల పల్లకీ సేవ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతులకు అర్చకులు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్'

బనగానపల్లె రూరల్: పట్టణంలోని 8వ వార్డు ఈద్గానగర్ కాలనీలో జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీ సుబ్బమ్మ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ కంబగిరి, గృహ సారథులు హనుమంతు, సుభాషిణి, రహీమాన్‌లతో కలిసి నాలుగేళ్ల పాలన గురించి ప్రజలను ఆరా తీశారు. వారి అభిప్రాయాలను నమోదు చేసుకుని, జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్‌ను ఇంటికి అతికించారు.

- **బేతంచెర్ల:** మండల పరిధిలోని గూటుపల్లె, ఆర్ఎస్ రంగాపురం గ్రామాల్లో సర్పంచ్‌లు శ్రీరాములు, గుమ్మగాల్ల రాజు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి జగన్ చిత్రపటం ఉన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు.
- **డోన్ టౌన్:** మండలంలోని కొత్తకోట, సోంపురం, ఆవులదొడ్డి, బి.రామదుర్గం, వెంకటాపురం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు సుదర్శనరెడ్డి, రాధమ్మ, మద్దిలేటి, నాగన్న, రాణితో పాటు ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించారు. జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అలాగే డోన్‌లో సచివాలయ గృహ సారథుల పట్టణ కన్వీనర్ కురుకుందు హరి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- **ప్యాపిలి:** జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ప్యాపిలి ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్‌రెడ్డి సోమవారం మెట్టుపల్లి, ఏనుగుమర్రి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు మహేంద్రమ్మ, కరణం మదన్‌మోహన్ పాల్గొన్నారు.

16న తెలుగు నాటక రంగ వేడుకలు

కర్నూలు కల్చరల్: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఈనెల 16వతేదీన తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. 14 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 14,15 తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నాటక రంగ సంస్థలకు ఏకాంకము పద్య పోటీలు జరుగుతాయని తెలిపారు. 14వ తేదీ రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ రాయబారం, కర్ణ రహస్యము, సుభద్రా రాయబారం, గయోపాఖ్యానం, తులా భారం, అలక సీను, 15న మాయల మరాఠీ, గయపాఖ్యానం, సత్య హరిశ్చంద్ర కాటి సీను ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. 16వ తేదీ సాయంత్రం 7 గంటలకు టీజీవీ కళాక్షేత్రం కళాకారులతో శ్రీకృష్ణ కర్ణార్జునీయం పద్యనాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాటక రంగంలో విశేష సేవలు అందించిన కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేయడంతో పాటు 14, 15 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమ నిర్వహణ కన్వీనర్లుగా లక్ష్మీకాంతరావు, రాజారత్నం వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక పొదుపు భవనంలో ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా విద్యాశాఖ, జాతీయ ఉపాధిహామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైఎస్సార్ క్రాంతి పథం, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్‌జీవన్ పథకం కింద జరుగుతున్న మొదటి విడత పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. రెండో విడత నిధులు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. బనగానపల్లె బైపాస్ రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.52 కోట్లలో భూసేకరణకు రూ.14.45 కోట్ల కేటాయించామన్నారు. భూ సేకరణ పూర్తి చేసి, ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తే సంబంధిత అధికారులు పనులు ప్రారంభిస్తారన్నారు. నిరాదరణకు గురైన పిల్లల కోస కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకంపై అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్ వైజర్లు ప్రజలకు అవగాహన కల్పించడంలేదని ఎమ్మెల్యే కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం పూర్తి వివరాలను సచివాలయాల్లోని నోటీసు బోర్డులో ఉంచడంతో పాటు అంగన్‌వాడీ వర్కర్లు వారి పరిధిలో ఉన్న పిల్లలను గుర్తించి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ శివరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, కుర్ని కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామలదేవి, ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, ఎంఈఓ స్వరూప, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: మండల పరిధిలోని తాటిమాను కొత్తూరు – జగదుర్తి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు బైకును ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన రఘురాంగౌడ్, దొరపల్లె లక్ష్మన్న సోమవారం బైకుపై తాటిమానుకొత్తూరు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను 108 వాహనంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

రోడ్డు దాటుతుండగా..

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన నారాయణ కలుగొట్ల ఆశ్రమం వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆక్రమణను అరికట్టండి

ప్యాపిలి: తన పొలానికి ఆనుకుని ఉన్న వంకను చంద్రపల్లి గ్రామానికి చెందిన ఉప్పలపాటి మద్దయ్య ఆక్రమించుకున్నాడని అదే గ్రామానికి చెందిన దామోదర్ రెడ్డి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశాడు. 293 సర్వే నంబర్‌లో తనకు 7.5 ఎకరాల పట్టా భూమి ఉందన్నారు. సర్వే నంబర్ 149లో 2.2 ఎకరాలు పట్టా భూమి ఉన్న ఉప్పలపాటి మద్దయ్య 50 సెంట్ల వంక భూమిని ఆక్రమించుకున్నట్లు తెలిపాడు. దీంతో వర్షాలు వస్తే తన పొలం ముంపునకు గురై తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు విచారణ చేపట్టి వంక భూమి ఆక్రమణను అరికట్టాలని ఫిర్యాదు చేశాడు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


బనగానపల్లె: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కటికవానికుంట, ఫతేనగర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటిటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. విద్య, వైద్య రంగాలతో పాటు మహిళల ఆర్థిక అభివృద్ధికి అధిక ప్రాముఖ్యత ఇచ్చినట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకే చేర్చారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరముందని చెప్పారు. అనంతరం కటికవానికుంట గ్రామంలో రూ.5 లక్షల డీఎంఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. మరో రూ.14 లక్షల నిధులతో డ్రైనేజీ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఏఈ రమణ, సర్పంచ్ నాగేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, గోపాల్‌రాజు, మోహన్‌రెడ్డి, నాగయ్య, శ్రీకాంత్, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫతేనగర్‌లో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

జోరుగా వేరుశనగ పంట తొలగింపు పనులు

బేతంచెర్ల: మండలంలో బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట తొలగింపు పనులు జోరందుకున్నాయి. ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం, ఆర్ కొత్తపల్లె, గూటుపల్లె, ముద్దవరం, శంకలాపురం, సీతారామాపురం గ్రామాల పరిధిలో సాగు చేసిన వేరుశనగ పంటలు పక్వదశకు రావడంతో పంటను తొలగించి, నూర్పిడి పనులు కొనసాగిస్తున్నారు. దీంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తోంది.



అంబాపురం సమీపంలో వేరుశనగ పంటను తొలగిస్తున్న కూలీలు

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

- ఎంపీపీ రమాదేవి

కోవెలకుంట్ల: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కలుగొట్ల జగనన్న కాలనీకి నీటి వసతి కల్పించకపోవడంతో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్ సభ దృష్టికి తెచ్చారు. ఆ శాఖ ఏఈ హరీష్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో నీటి వసతి కల్పించేందుకు రూ.6.50 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. చిన్నకొప్పెర్ల గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి గ్రామ సచివాలయం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, రేవనూరు గ్రామంలో చేతిపంపు శిథిలావస్థకు చేరుకుందని సభ్యులు సభలో ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగితే కౌలు రైతులకు నష్ట పరిహారం వర్తించడం లేదని ఎంపీపీ సభ దృష్టికి తీసుకురాగా ఏఓ నిరంజన్ స్పందిస్తూ పంటల నమోదు సమయంలో భూ యజమానుల పేర్లు నమోదవుతుండటంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. కౌలు రైతులు పొలాన్ని కౌలుకు తీసుకునే సమయంలో భూ యజమానితో ఒప్పంద పత్రం రాయించుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వీడి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, కోఆప్షన్ మెంబర్ దిల్కాబాషా, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, వైఎస్సార్‌క్రాంతిపథం ఏపీఎం గురుస్వామి, ఉద్యానవనశాఖ అధికారిణి, ధరణి, ఎంఈఓ తిమ్మారెడ్డి, ఈఓపీఆర్‌డీ రాధిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

ముమ్మరంగా ట్రీ కటింగ్ పనులు



సబ్ జైలు ప్రాంతంలో చెట్టు కొమ్మలు కత్తిరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: విద్యుత్ సరఫరాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు పట్టణంలో ట్రీ కటింగ్ పనులు చేపట్టినట్లు విద్యుత్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను గుర్తించి సిబ్బంది చేత తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు ఉన్నట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

12న భారీ వాహనాల మళ్లింపు

బనగానపల్లె రూరల్: మండలంలోని అప్పలాపురం గ్రామంలో ఈ నెల 12న పెద్దమ్మ దేవర సందర్భంగా బనగానపల్లె నుంచి టంగుటూరు మీదుగా నంద్యాలకు వెళ్లే భారీ సిమెంట్ లారీల రాకపోకలను మళ్లించినట్లు బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, నందివర్గం ఎస్ఐ రామాంజనేయ రెడ్డిలు సోమవారం తెలిపారు. బనగానపల్లె నుంచి వచ్చే వాహనాలను పట్టణ సమీపంలోని రొడ్స్ సర్కిల్ వద్ద, నంద్యాల నుంచి వచ్చే వాహనాలను తేళ్లపురి గ్రామ సమీపంలో మళ్లించామని, వాహనదారులు సహకరించాలని వారు కోరారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాయసం రంగారెడ్డి (60) సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.